

జీవన 'యోగ'ం

మనసు, శరీరంపై పట్టు సాధించేందుకు, ఒత్తిడిని తగ్గించడానికి 'యోగా' సాధన ఔషధంగా మారింది. 8లో



చీనీ టన్ను రూ.32 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.32 వేలు పలికాయి.

గరిష్టం/కనిష్టం
36.3°/23.6°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత నెలకొంది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

అన్నదాతలను ఆదుకోండి

- గత రబీలో రూ.135 కోట్ల నష్టం
- ఆ మేర నిధులు విడుదల చేయండి
- కేంద్ర బృందానికి కలెక్టర్ వినోద్‌కుమార్ విన్నపం
- 14 మండలాల్లో రూ.45 కోట్ల పంట నష్టం
- ఇతర రంగాలకు రూ.90 కోట్ల నష్టం చేకూరిందని వెల్లడి



జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులతో రబీ కరువు పరిస్థితులు, పంటనష్టంపై సమీక్షిస్తున్న కేంద్ర బృందం

అనంతపురం అగ్రికల్చర్: కరువు బారిన పడిన జిల్లాకు రూ.135.26 కోట్ల సాయం అందించాలని కేంద్ర బృందానికి జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నివేదిక అందించారు. గత 2023–24 రబీలో నెలకొన్న కరువు పరిస్థితులు, రైతుల స్థితిగతులు తెలుసుకునే నిమిత్తం ఆరుగురితో కూడిన ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం (ఐఎంసీటీ) జిల్లాకు విచ్చేసింది. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ రితేష్‌చౌహాన్ టీం లీడర్‌గా ఉన్న బృంద సభ్యులు బుధవారం స్థానిక కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో జిల్లా అధికారులతో సమీక్షించారు. మరో నలుగురితో కూడిన కేంద్ర బృంద సభ్యులు నెల్లూరు నుంచి వర్చువల్ పద్ధతిలో సమీక్షలో పాల్గొన్నారు. వీరితో పాటు రాష్ట్ర ప్రకృతి విపత్తుల నిర్వహణ విభాగం డైరెక్టర్ ఆర్.కూర్మానాథ్ నేతృత్వంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.నాగరాజు, గ్రౌండ్ వాటర్ ఏడీ విశ్వేశ్వరరావు, జేడీఏ జగ్గారావు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ చీఫ్ ఇంజినీరు ఎం.బ్రహ్మాజీ, పశుశాఖ జేడీ ఈశ్వర్ రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ఎషాబాషా, గ్రామీణాభివృద్ధిశాఖ జాయింట్ కమిషనర్ శివప్రసాద్‌తో కూడిన రాష్ట్ర స్థాయి బృంద సభ్యులు కూడా సమీక్షకు హాజరయ్యారు.

93 శాతం లోటు వర్షపాతం..

ఈ సందర్భంగా కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ గత రబీలో ఈశాన్య రుతుపవనాలు ప్రభావం చూపకపోవడంతో అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య సాధారణ వర్షపాతం 100.9 మి.మీ గానూ కేవలం 6.4 మి.మీ వర్షం కురిసిందని వివరించారు. దీంతో పంటలు దారుణంగా దెబ్బతిన్నాయన్నారు. భూగర్భ జలాలు కూడా సగటున 15.22 మీటర్లకు చేరుకున్నాయన్నారు. నిబంధనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం బెళుగుప్ప, బొమ్మనహాళ్, డీ.హీరేహాళ్, గుత్తి, గుంతకల్లు, కణేకల్లు, పెద్దపప్పూరు, పుట్లూరు, తాడిపత్రి, ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు, యాడికి, యల్లనూరు తదితర మండలాలను కరువు జాబితాలో చేర్చినట్లు వివరించారు. పప్పుశనగతో పాటు జొన్న తదితర పంటలు 53,014 హెక్టార్లలో దెబ్బతినడంతో 39,694 మంది రైతులకు రూ.45.06 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ఈ మొత్తాన్ని ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో ఇవ్వడానికి సాయం అందించాలన్నారు. పంట నష్టంతో పాటు పశుసంవర్ధక శాఖ పరిధిలో రూ.5.38 కోట్లు, గ్రామీణ, పట్టణ తాగునీటి సరఫరా విభాగాలకు రూ.6.22 కోట్లు, అలాగే ఉపాధిహామీ పథకం కింద రూ.78.60 కోట్లు... మొత్తంగా జిల్లాకు రూ.135.26 కోట్లు కరువు సాయం అందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అనంతరం ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా పంటనష్టం, ఇతరత్రా అంశాల గురించి కేంద్ర బృందానికి తెలియజేశారు. సమీక్షలో బృంద సభ్యులు డాక్టర్ కె.పొన్నుస్వామి (ఆయిల్‌సీడ్స్ డైరెక్టర్), సునీల్‌దుబే (అగ్రికల్చర్ అండ్ ఫార్మర్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్), చిన్మయ్ పుండ్లికరావ్ గోత్మారే (డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎక్స్‌పెండిచర్ డైరెక్టర్),అషిష్‌పాండే (డిపార్ట్‌మెంట్ ఆఫ్ డ్రింకింగ్‌వాటర్ అండ్ శానిటేషన్ డిప్యూటీ అడ్వైజర్), అరవింద్‌కుమార్ సోనీ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండర్‌సెక్రటరీ), జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, వ్యవసాయ, అనుబంధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు కేంద్ర బృందం పర్యటన

వజ్రకరూరు: కేంద్ర బృందం గురువారం జిల్లాలోని ఉరవకొండ, విడపనకల్లు, కణేకల్లు తదితర మండలాల్లో పర్యటించనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఉదయం 11 గంటలకు వజ్రకరూరు మండలం గూళ్యపాళ్యంలో పర్యటించి.. 2023–24 రబీలో దెబ్బతిన్న పంటల వివరాలను సేకరిస్తుందన్నారు. పశుగ్రాసం కొరత, తాగునీటి ఎద్దడి తదితర పరిస్థితులపై కూడా రైతులతో ఆరా తీస్తారన్నారు. కార్యక్రమానికి అధికారులు, రైతులు తదితరులు తప్పక హాజరు కావాలన్నారు.

న్యూస్‌రీల్

ఎస్కేయూ రెక్టార్‌గా వెంకట నాయుడు



ప్రొఫెసర్ వెంకట నాయుడుకు నియామక పత్రం అందజేస్తున్న వీసీ హుస్సేన్ రెడ్డి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నూతన రెక్టార్‌గా ప్రొఫెసర్ జి. వెంకట నాయుడు నియమితులయ్యారు. వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కే. హుస్సేన్ రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో వెంకట నాయుడు రెక్టార్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు. వీసీ ప్రొఫెసర్ కే. హుస్సేన్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య అభినందించారు. వర్సిటీ పురోగతికి శాయశక్తులా కృషి చేస్తానని ప్రొఫెసర్ వెంకట నాయుడు పేర్కొన్నారు.

- వెంకటనాయుడు ఎకనామిక్స్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్. సౌమ్యుడు, వివాదరహితుడిగా గుర్తింపు ఉంది. బోధన, పరిశోధనలో అపారమైన అనుభవం గడించారు. స్థూల అర్థశాస్త్రం (మేక్రో ఎకనామిక్స్), అగ్రికల్చర్ ఎకనామిక్స్ రంగంలో పేరు గాంచారు. ఇప్పటివరకూ 24 జర్నల్స్ ప్రచురించారు. 21 అంతర్జాతీయ కాన్ఫరెన్సుల్లో ప్రసంగించారు. 5 పీహెచ్‌డీ అవార్డులు ఈయన పర్యవేక్షణలో అందజేశారు.

క్యాంపుల పేరుతో ఎక్కడికి వెళ్తున్నారు?

- సమగ్ర శిక్ష ఈఈ, డీఈలపై ఏపీసీ నిదియాదేవి ఆగ్రహం



అనంతపురం ఎడ్యుకేషన్: రోజూ క్యాంపులు అని చెబుతూ ఎక్కడికి వెళ్తున్నారని సమగ్రశిక్ష ఈఈ శంకరయ్య, డీఈ జయరామ్‌పై సమగ్ర శిక్ష ఏపీసీ వైఖోమ్ నిదియాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మధ్యాహ్నం కార్యాలయానికి వచ్చిన నిదియాదేవి సాయంత్రం దాకా తన చాంబరులోనే ఉన్నారు. సెక్టోరియల్ అధికారులతో వివిధ అంశాలపై మాట్లాడారు. ఈ క్రమంలో ఈఈ, డీఈ గురించి ఆరా తీశారు. సైట్ ఇంజినీర్ వచ్చి 'మేడమ్ వాళ్లిద్దరూ క్యాంపునకు వెళ్లారు' అని చెప్పడంతో ఏపీసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఈఈ, డీఈ ఎక్కడికి వెళ్లారు, ఏం చేస్తున్నారు, రోజూ ఏం క్యాంపు ఉంటుంది, ఒకవేళ వెళ్లినా మధ్యాహ్నం దాకా క్యాంపు చూసుకుని తర్వాత కార్యాలయానికి రావాలి, లేదంటే మధ్యాహ్నం వరకు ఆఫీసుకు వచ్చి తర్వాత క్యాంపునకు వెళ్లాలి కదా' అని మండిపడ్డారు. ఇలా ఫీల్డ్ అని చెబితే కుదరదని వారు రోజూ ఎక్కడికి వెళ్తున్నారో తనకు ఆన్‌లైన్‌లో కనిపించేలా చర్యలు తీసుకోవాలని ఏపీసీ ఆదేశించారు.

ఐటీఐ అడ్మిషన్ల కౌన్సెలింగ్ ప్రారంభం



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలకు బుధవారం కౌన్సెలింగ్ ప్రారంభమైంది. అనంతపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు 282 మందికి గాను 90 మంది విద్యార్థులు వివిధ ట్రేడుల్లో ప్రవేశాలు పొందారు. గురువారం పీజీఏ 6.8 నుంచి 5 వరకు, శుక్రవారం 4.8 నుంచి 0 వరకు జీపీఏ సాధించిన విద్యార్థులకు కౌన్సెలింగ్ ఉంటుందని కన్వీనర్ రామమూర్తి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తప్పకుండా హాజరు కావాలని సూచించారు.

టీబీ డ్యాంకు తగ్గిన ఇన్‌ఫ్లో




బొమ్మనహాళ్: కర్ణాటకలోని హొస్పేట వద్ద ఉన్న తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో తగ్గింది. బుధవారానికి 749 క్యూసెక్కులకు పడిపోయింది. రాయచూర్‌కు సంబంధించిన లెఫ్ట్ బ్రాంచ్ మెయిన్ కెనాల్ (ఎల్‌బీఎంసీ)కు 1,620 క్యూసెక్కులు, రాయబసవన కాలువకు 116, జిందాల్ 1 కూసెక్కులతో కలిపి 1,710 క్యూసెక్కుల నీటిని వదులుతుండడంతో డ్యాంలో నీటిమట్టం 5.887 టీఎంసీలకు తగ్గింది. 105.788 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 5.887 టీఎంసీల నీరు ఉంది.

నిండుతున్న గాజనూరు (తుంగ) జలాశయం..

కర్ణాటకలోని శివమొగ్గ జిల్లాలో కొన్ని రోజులుగా ఆశాజనకంగా వర్షాలు కురుస్తుండడంతో టీబీ డ్యాం ఎగువన 3.10 టీఎంసీల సామర్థ్యం ఉన్న గాజనూరు జలాశయం (తుంగ ప్రాజెక్టు)లో నీటి నిల్వ గరిష్ట మట్టానికి చేరుతోంది. నేడో, రేపో జలాశయం గేట్లను ఎత్తే అవకాశం ఉండడంతో దిగువన ఉన్న తుంగభద్ర డ్యాంకు నీరు పరుగున రానున్నాయి. ఎగువన ఉన్న చిక్కమగళూరు, కొప్పి, శివమొగ్గ, శృంగేరి, వరనాడు, మంగళూరు, తీర్థనహళ్లి తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు అక్కడి నదులకు వరద పెరుగుతోంది. తుంగ నుంచి నీరు విడుదలై టీబీ డ్యాం త్వరగా నిండాలని రైతులు కోరుకుంటున్నారు.

రాచానపల్లిలో కామపిశాచి!

- పసిబిడ్డల పట్ల 60 ఏళ్ల కామాంధుడి అసభ్య ప్రవర్తన
- ప్రైవేట్ పార్ట్‌ల వద్ద నొప్పంటూ తల్లుల వద్ద బాలికల మొర
- పోలీసులకు బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు
- పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు



నిందితుడు ఎం. రంగనాయకులు



రాప్తాడురూరల్: తన లైంగిక కోరికలను అభం శుభం తెలియని చిన్నారుల ద్వారా తీర్చుకోవాలనుకున్నాడో కామపిశాచి. 60 ఏళ్ల వయసు ఉన్నా తన చిల్లర బుద్ధిని మాత్రం మార్చుకోలేదు. బాలికలను తినుబండారాల పేరుతో ఆశపెట్టి ఇంట్లోకి పిలుచుకుని వికృతానందం పొందాడు. మృగాడి వెకిలిచేష్టలతో తమకు ప్రైవేట్ పార్ట్‌ల వద్ద నొప్పి ఉందంటూ ఆ బాలికలు తల్లులకు చెప్పడంతో అకృత్యాలు వెలుగులోకి వచ్చాయి. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. అనంతపురం రూరల్ మండలం రాచానపల్లిలో ఈ ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన మేరకు.. రాచానపల్లికి చెందిన మాదినేని రంగనాయకులు సెంట్రింగ్ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, పెళ్లయిన కూతురు, కుమారుడు ఉన్నారు. మంగళవారం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎనిమిదేళ్ల వయసున్న ఇద్దరు బాలికలను ఇంట్లోకి పిలుచుకుని 'మీ అమ్మవాళ్లు మా ఇంట్లో పూరీలు పెట్టారు.. తినండి' అంటూ మభ్యపెట్టాడు. తర్వాత ఇద్దరి చిన్నారుల ప్రైవేట్ పార్ట్‌లను బలంగా తాకాడు. ఆ తర్వాత చిన్నారులు వారి ఇళ్లకు వెళ్లిపోయారు.

వెలుగులోకి ఇలా..

ఇంటికి వెళ్లిన చిన్నారుల్లో ఒక బాలిక తనకు ప్రైవేట్ పార్ట్ వద్ద, ఎదవద్ద నొప్పంటూ నానమ్మతో చెప్పింది. రంగనాయకులు ఇంట్లో జరిగిన ఉదంతాన్ని బాలిక ద్వారా తెలుసుకున్న నానమ్మ... మరో బాలిక తల్లి వద్దకు వెళ్లి ఆరా తీసింది. ఆ అమ్మాయి కూడా ప్రైవేట్ పార్ట్ వద్ద, ఎదవద్ద నొప్పంటూ తల్లికి తెలిపింది. రంగనాయకులు చిన్నారులపై బలవంతంగా చేతులు వేయడం వల్లే ఈ రకంగా జరిగినట్లు నిర్ధారించుకున్నారు. జరిగిన ఘటనపై చిన్నారుల తల్లిదండ్రులు బుధవారం అనంతపురం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

సికిల్ సెల్ వ్యాధిని నిర్మూలించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం రూరల్: సికిల్ సెల్ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. 'అంతర్జాతీయ సికిల్ సెల్ డే' సందర్భంగా బుధవారం నగరంలోని గిరిజన సంక్షేమ వసతి గృహంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ వ్యాధులను రూపుమాపేందుకు వైద్య సిబ్బంది చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. జిల్లాలో సికిల్ సెల్ వ్యాధితో ఎంతో మంది ఇబ్బంది పడుతున్నారన్నారు. వైద్య సిబ్బంది తరచూ రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు, సలహాలు అందించాలన్నారు. వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులు ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. సమాజం పట్ల అవగాహన పెంచుకోవడంతో పాటు కష్టపడే తత్వం అలవర్చుకోవాలన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువులు కొనసాగిస్తే ఉన్నత శిఖరాలు చేరుకుంటారన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి రామాంజినేయులు, డాక్టర్ మహేంద్రనాథ్, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూకొఠారి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం బాగుంది



ప్రకృతి వ్యవసాయ విధానాన్ని తెలుసుకుంటున్న జాంబియా దేశస్తులు

- జాంబియా దేశ ప్రతినిధి బృందం కితాబు

బత్తలపల్లి: ప్రకృతికి మేలు చేయడంతో పాటు రైతుకు లాభం చేకూర్చే ప్రకృతి వ్యవసాయం చాలా బాగుందని జాంబియా ప్రతినిధి బృందం కొనియాడింది. ఉమ్మడి అనంతపురం డీపీఎం లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 19 తేదీ వరకు జాంబియా దేశానికి చెందిన ప్రతినిధి బృందానికి ప్రకృతి వ్యవసాయంపై క్షేత్రస్థాయి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ క్రమంలో బుధవారం జాంబియా ప్రతినిధి బృందం మండలంలోని బత్తలపల్లి, గంటాపురం, రాఘవంపల్లి గ్రామాల్లో పర్యటించింది. ఈ సందర్భంగా రైతు సాధికార సంస్థ మెంటార్ సుకన్య, ఎస్ఎఫ్ ఎల్–1 నరసింహులు తదితరులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను వారికి వివరించారు. ఘన జీవామృతం తయారీ, ఉపయోగాలు, నీమస్త్రం తయారీ విధానం, ఉపయోగాలు, ఏటీఎం మోడల్ షోవింగ్, డీఆర్పీ మోడల్ షోవింగ్,విత్తన గుళికల తయారీ విధానం, ఏ–గ్రేడ్ మోడల్ షోయింగ్ విధానం తదితర వాటి గురించి తెలిపారు. పెట్టుబడి తక్కువ కావడంతో పాటు విష రసాయనాలు లేని దిగుబడులిచ్చే ప్రకృతి వ్యవసాయాన్ని తమ దేశ రైతులూ చేపట్టేలా అవగాహన కల్పిస్తామని జాంబియా ప్రతినిధి బృందం తెలిపింది. కార్యక్రమంలో ఎంసీఆర్పీలు రాధమ్మ, పార్వతి, ముత్యాలప్ప, ఐసీఆర్పీఎస్ నగేంద్రమ్మ, గంగమ్మ, అమృత రాణి, లీలావతి, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

అరచేతిలో వాతావరణం

- ప్రత్యేక యాప్‌లు రూపొందించిన కేంద్రం
- గ్రామ పంచాయతీ స్థాయిలోనే వాతావరణం అంచనా
- ఫోన్‌లో ఈ యాప్స్ ఉంటే వర్షం, పిడుగుల సమాచారం
- ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులు తెలుసుకునే సౌలభ్యం



మేఘదూత్ యాప్



రెయిన్ యాప్

ధర్మవరం అర్బన్: వాన రాకడ... ప్రాణం పోకడ... ఎవరికి తెలుస్తుందనేది పాత నానుడి. నేడు శాస్త్ర సాంకేతిక రంగాల్లో సాధించిన ప్రగతితో వర్షం రాకను ముందుగానే పసిగట్టేస్తున్నారు. అదే సమాచారాన్ని మెసేజ్‌ల రూపంలో సెల్‌ఫోన్లకు పంపి మానవాళిని అప్రమత్తం చేస్తున్నారు. భారీ వర్షాలు, పెను గాలులు, పిడుగుపాటు తదితర ప్రకృతి విపత్తుల నుంచి పూర్తిగా బయటపడలేకపోయినా నష్ట శాతం గణనీయంగా తగ్గుతోంది.

వ్యవసాయ, అనుబంధ రంగాలకు ఎంతో ప్రయోజనం

దేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు ప్రాణాధారంగా మారాయి. విత్తు నాటడం మొదలు పంట విక్రయం వరకూ అడుగడుగునా సవాళ్లే. వీటిలో సింహభాగం వాతావరణ పరిస్థితులదే. ఎప్పటికప్పుడు వాతావరణంలో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటూ అనుక్షణం సవాళ్లు విసురుతూ ఉంటోంది. వర్షాలు, పెను గాలులు తీవ్ర ఆర్థిక నష్టానికి కారణమవుతుంటాయి. పిడుగుపాటు ప్రమాదాలు రైతులు, వ్యవసాయ కూలీలు, గొర్రెలు, పశువుల కాపర్లు, ఆరుబయట ప్రాంతాల్లో తిరిగే వ్యవసాయ కూలీలను విగత జీవులుగా మారుస్తున్నాయి. పిడుగు పడితే విలువైన పశుసంపద, మహా వృక్షాలు, మనుషులు, జంతువుల ప్రాణాలు గాల్లో కలిసిపోతాయి. ఈ కష్టాలకు భారత వాతావరణ విభాగం(ఐఎండీ) తెరదించింది. అందుబాటులోకి తీసుకువచ్చిన ప్రత్యేక యాప్‌ల ద్వారా పిడుగు పడే అవకాశం ముందస్తుగా తెలుసుకునే అవకాశంతో పాటు ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా చూసుకునే వెసులుబాటు ఉంది. గ్రామ పంచాయతీ స్థాయిలోనే వాతావరణం అంచనాలు విడుదల చేస్తోంది. చేతిలో స్మార్ట్‌ఫోన్, ఇంటర్‌నెట్ సౌకర్యం ఉంటే వాతావరణం వివరాలు తెలుసుకుని అప్రమత్తమయ్యే వీలు కల్పిస్తోంది.

వారం ముందే 'మేఘదూత్'

పంట సాగులో విత్తనం నుంచి ఎరువులు వేసే సమయం, లేదా పంట నూర్పిడి సమయంలో రైతులను నష్టపరిచేది వర్షమే. ఇలాంటి నష్టాల నుంచి బయటపడేందుకు 'మేఘదూత్' యాప్ ఎంతో దోహదపడుతోంది. దీని సాయంతో వారం ముందుగా నాలుగు, ఐదు రోజుల వాతావరణ మార్పులు, వర్షసూచన సహా ఆకాశం మేఘావృతం అవుతుందా? లేదా? గాలులు ఏ దిశ నుంచి ఏ దిశకు వీస్తాయి? తేమ శాతం, ఉష్ణోగ్రత వివరాలు తెలుసుకోవచ్చు. ఈ యాప్ ద్వారా ప్రతి మంగళ, శుక్రవారాల్లో వాతావరణ సమాచారంతో ఆగ్రో మెట్ ఫీల్డ్ యూనిట్ల (ఏఎంఎఫ్‌యూ) సమాచారం రైతుల ఫోన్లకు సంక్షిప్త సమాచారం రూపంలో అందుతుంది.

వర్షాన్ని గుర్తించే 'రెయిన్ అలారమ్'

గూగుల్ ప్లేస్టోర్ నుంచి రెయిన్ అలారం యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వినియోగదారుడు అందించిన సమాచారం మేరకు అతను ఉండే ప్రాంతానికి చుట్టుపక్కల 20 కి.మీ పరిధిలో ఎక్కడ వర్షం పడే సూచనలున్నాయో ఇట్టే తెలుసుకోవచ్చు. వర్షం ముప్పును ముందే తెలుసుకుని జాగ్రత్త పడే అవకాశం ఉంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

పిడుగు సమాచారానికి 'వజ్రపాత్'

గూగుల్ ప్లేస్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ గుర్తుపై నొక్కితే రెండు రకాల సమాచారం వస్తుంది. ఎడమ వైపు పిడుగు గుర్తు, పిడుగు సమాచారం కనిపిస్తుంది. అక్కడ నొక్కితే మనం ఉన్న ప్రాంతం సహా మ్యాప్ కనిపిస్తుంది. రెడ్, ఆరెంజ్, ఎల్లో కలర్‌లలో వలయాలు కనిపిస్తాయి. వీటి పక్కనే 8, 15, 30 అంకెలుంటాయి. ఈ అంకెల ప్రకారం అంటే కొద్ది సేపట్లో అంత దూరంలో(కిలోమీటర్లలో) పిడుగు పడే అవకాశం ఉందని తెలుస్తుంది. ఎంత దూరంలో పిడుగు పడుతుందో పిన్ రూపంలో స్పష్టత ఇస్తుంది. యాప్ కుడి భాగంలో పిడుగుపాటు హెచ్చరికలు తెలిపే బటన్ ఉంటుంది. యాప్ ఆన్ చేసి ఎప్పటికప్పుడు అప్రమత్తం కావొచ్చు.

ప్రయోజనాలు చాలా

సెల్‌ఫోన్లలో యాప్‌లు అందుబాటులోకి రావడంతో ఎప్పటికప్పుడు వాతావరణ సమాచారాన్ని తెలుసుకునే వీలుంది. విత్తనాలు వేసుకోవడం, పురుగు మందులు పిచికారీ చేయడం, రసాయనిక ఎరువులు వేసుకున్న సమయంలో వర్షం కారణంగా తీవ్రంగా నష్టపోయే ప్రమాదముంది. అయితే వాతావరణ యాప్‌లు ఇన్‌స్టాల్ చేసుకోవడం ద్వారా వర్ష సూచన ముందుగానే తెలుసుకుని జాగ్రత్త పడవచ్చు.

– క్రిష్టయ్య, ఏడీఏ, ధర్మవరం

మెరుపులను తెలిపే 'దామిని'



ఎప్పటికప్పుడు మెరుపు హెచ్చరికలను తెలియజేసేందుకు 'దామిని' యాప్ ఉపయోగపడుతుంది. దీని సాయంతో సమీపంలో 20 కి.మీ పరిధిలో ఐదు నుంచి 20 నిమిషాల వ్యవధిలో ఎక్కడ పిడుగు పడే అవకాశం ఉందో అప్రమత్తం చేస్తుంది. మెరుపు ఎందుకు వస్తుంది. మెరుపు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ యాప్‌లో వివరించారు. లొకేషన్ ఆధారంగా ఎక్కడెక్కడ మెరుపులు వచ్చే అవకాశముందో సూచిస్తుంది. పిడుగు పడినప్పుడు తోటివారికి అందించాల్సిన వైద్య సాయం, శ్వాస ఆగిపోతే నోటి నుంచి శ్వాసను అందించడం, గుండె చప్పుడు ఆగిపోతే సీపీఆర్ చేయడం తదితర వివరాలతో పాటు పిడుగు పడినప్పుడు ప్రాథమికంగా చేయకూడనివి, చేయాల్సిన పనులు దీని ద్వారా తెలుసుకోవచ్చు.

పేదల గుండె చప్పుడు ఫాదర్ ఫెర్రర్



పేదలకు మొక్కలు పంపిణీ చేస్తున్న మాంఛో ఫెర్రర్

కుందుర్పి: ఆపన్నులను ఆదుకుని జిల్లా ప్రజల ఆరాధ్య దైవంగా ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని ఆర్డీటీ ప్రోగాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ వైవీ మల్లారెడ్డి అన్నారు. ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ 15వ వర్ధంతి సందర్భంగా బుధవారం కుందుర్పిలోని ఫెర్రర్ ఆలయంలో ఘనంగా పూజలు నిర్వహించారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా కుందుర్పిలో రూ.8కోట్లతో ఫెర్రర్ ఆలయం, దాని పక్కనే కమ్యూనిటీ భవనం నిర్మించడం తెలిసిందే. కార్యక్రమంలో పాల్గొన్న మాంఛోఫెర్రర్ మాట్లాడుతూ... 58 ఏళ్ల పాటు ఫాదర్ ఫెర్రర్ ఈ జిల్లాలో అందించిన సేవలను గుర్తు చేశారు. ఆయన ఆశయ సాధనలోనే ఆర్డీటీ కొనసాగుతోందన్నారు. అనంతరం పేదలకు దుప్పట్లు, మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీటీ చైర్మన్ తిప్పేస్వామి, ఐఎఫ్ఐ డైరెక్టర్ సాగరమూర్తి, ట్రాన్స్‌పోర్ట్ డైరెక్టర్ నిర్మల్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, ఆర్‌డీ సుబ్బారావు, ఏటీఎల్ నారాయణస్వామి, మాజీ జెడ్పీటీసీ రాజగోపాల్, వైబీ ఓబయ్య, ఓబిగానిపల్లి సుబ్బరాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అత్యాచార యత్నం కేసు నమోదు

గుంతకల్లు రూరల్: మహిళపై అత్యాచార యత్నం చేసిన సూరి అనే వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు గుంతకల్లు రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు. వివరాలు... గుంతకల్లు మండలం నెలగొండ గ్రామానికి చెందిన సూరి మంగళవారం రాత్రి ఓ ఇంట్లోకి చొరబడి ఒంటరిగా ఉన్న మహిళపై అత్యాచార యత్నం చేశాడు. అదే సమయంలో మహిళ భర్త ఇంట్లోకి చేరుకుని సూరికి దేహశుద్ధి చేయడంతో అక్కడ నుంచి పారిపోయాడు. దీనిపై తన భర్తతో కలసి బాధిత మహిళ బుధవారం ఉదయం ఫిర్యాదు చేసింది. విచారణ అనంతరం సూరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భర్తపై భార్య దాడి

ధర్మవరం రూరల్: స్థానిక శివానగర్‌కు చెందిన చట్ట రవివర్ధన్‌పై భార్య దాడి చేసింది. బాధితుడు తెలిపిన మేరకు... ఎనిమిదేళ్ల క్రితం హిందూపురానికి చెందిన ధనలక్ష్మితో రవివర్ధన్‌కు వివాహమైంది. కొంత కాలంగా మనస్పర్థలు తలెత్తడంతో దంపతులిద్దరూ విడాకుల కావాలని కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో ధనలక్ష్మి, ఆమె చెల్లెలు రూప, అమ్మ లక్ష్మీదేవి బుధవారం ఉదయం రవివర్ధన్ ఇంటికి చేరుకుని గొడవపడ్డారు. మాటామాట పెరగడంతో రవివర్ధన్‌పై భార్య దాడి చేసింది. ఘటనలో రవివర్ధన్ కుడి కాలు, ఎడమ చెయ్యి విరిగింది. క్షతగాత్రుడిని కుటుంబసభ్యులు ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు కేసి, దర్యాప్తు చేపట్టారు.


కణేకల్లు ఎంపీపీ సంధ్య రాజీనామా

అనంతపురం సిటీ: కణేకల్లు ఎంపీపీ హరిజన సంధ్య తన పదవికి రాజీనామా చేశారు. జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవిని బుధవారం సాయంత్రం ఆమె కలసి తన రాజీనామా లేఖను అందజేశారు. గనిగెర ప్రాదేశిక నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ తరపున ఎంపీటీసీ సభ్యురాలిగా గెలిచి ఎంపీపీ అయ్యారు. ఈ క్రమంలో ఎంపీటీసీ సహా ఎంపీపీ పదవులకు ఆమె రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల తోనే తాను రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నట్లు జెడ్పీ అధికారులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

హిందూపురం అర్బన్: స్థానిక మేళాపురంలో నివాసముంటున్న వివాహిత గంగోత్రి(21) ఆత్మహత్య చేసుకుంది. నాలుగేళ్ల క్రితం మడకశిర నియోజకవర్గం కల్లూరు గ్రామానికి చెందిన మధు అనే వ్యక్తితో ఆమెకు వివాహమైంది. ఇటీవల గర్భం దాల్చిన ప్రసవానికి పుట్టింటికి వచ్చింది. అయితే రెండు నెలల క్రితం పురిట్లోనే బిడ్డ మృతిచెందడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. ఈ క్రమంలో అనారోగ్యం వెన్నాడడంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు వన్‌టౌన్ ఎస్ఐ హరూన్‌బాషా తెలిపారు.

జీవన యోగం



- 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం
- నేడు యోగా చైతన్య ర్యాలీ

అనంతపురం కల్చరల్/పామిడి: మారుతున్న కాలంలో ప్రతి మనిషి ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ఒత్తిడి. అత్యంత ప్రమాదకరంగా పరిణమిస్తున్న ఈ రుగ్మతను తగ్గించడానికి 'యోగా' ముఖ్యమైన ఔషధంగా మారింది. భారతీయ తత్వశాస్త్రాల్లో షట్ దర్శనాల్లో న్యాయం, వైశేషికం, వేదాంతం, మీమాంస, సాంఖ్యం తర్వాత యోగం ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. మనసుపై, శరీరంపై పట్టు సాధించడమే యోగాభ్యాసం అంతిమలక్ష్యమని సాధకులు అంటుంటారు. దేహం, మనసు, భావోద్వేగాలను సమతుల్యం చేయడమే యోగమని విశ్లేషిస్తున్నారు. ఒత్తిడిని తగ్గించి ఆనందకర జీవనానికి తోడ్పడే సనాతన భారతీయ జీవన విధానంలో భాగమైన యోగ విశిష్టతను తెలియజేసేందుకు ఏటా జూన్ 21న 'అంతర్జాతీయ యోగా దినోత్సవం' జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

మహిళా సాధికారత అంశంపై

ఏటా యోగా దినోత్సవాన్ని ఒక్కో అంశానికి ప్రాధాన్యతనిస్తూ చేస్తుండడం గమనార్హం. ఈ ఏడాది మహిళా సాధికారత అంశంపై యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ క్రమంలో యోగాపై ప్రజలను చైతన్య పరుస్తూ గురువారం ఉదయం 7.30 గంటలకు అనంతపురంలోని ఆర్ట్స్ కాలేజ్ నుంచి పురవీధుల్లో ర్యాలీ చేపట్టనున్నారు. అలాగే అన్ని యోగా కేంద్రాల సమన్వయంతో శుక్రవారం ఉదయం 6.30 గంటలకు పోలీసు పరేడ్ మైదానంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నారు. అలాగే పామిడిలోనూ గురువారం ఉదయం 10 గంటలకు ర్యాలీ ఉంటుందని యోగా శిక్షకురాలు ఎస్.సంధ్యాదత్తు తెలిపారు. శుక్రవారం ఉదయం 6 నుంచి 6.45 గంటల వరకూ ప్రోటోకాల్ యోగా ఉంటుందన్నారు.

ప్రతి ఆసనం ఉప'యోగ'మే

యోగాభ్యాసం సకల సమస్యలకు పరిష్కారం చూపుతుందని అందరూ విశ్వసిస్తున్నారు. అయితే యోగాభ్యాసంలో భాగంగా సాగే ఒక్కో ఆసనం ద్వారా ఒక్కో ఉపయోగం ఉంటుంది. పూర్ణ ధనురాసన్, చక్రాసన్, వృక్షాసన్, హలాసన్, జాను శీర్షాసన్, పశ్చిమోత్తానసన్, వృష్టాసన్, శలాభసన్, వృశ్చికాసన్ వంటి వాటి వల్ల అభ్యాసకులు రోజంతా ఉత్సాహంగా గడుపుతుండడం గమనార్హం. బీపీ, షుగర్ సమస్యలకు నివారిణిగా ధ్యానం, యోగా పని చేస్తుంది. ధ్యానంతో మనో వికాసం, ఆధ్యాత్మిక జ్ఞానం కలుగుతుంది. తలనొప్పి, వెన్నునొప్పి, మోకాళ్లనొప్పులు, అలసటలాంటి వాటిని దూరం చేసుకోవాలంటే యోగా తప్పనిసరి అని శాస్త్రీయంగా నిరూపితమైంది.

రేపు యోగా దినోత్సవం : కలెక్టర్

అనంతపురం అర్బన్: పదవ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈనెల 21న ఘనంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో శుక్రవారం ఉదయం 6.30 గంటలకు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. అందరూ పాల్గొని అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



వృక్షాసనం

అందరి భాగస్వామ్యంతో..



"చాలా మంది అనారోగ్యంతో బాధపడుతూ వచ్చి యోగ, ధ్యానంతో అన్ని రుగ్మతల నుంచి బయట పడుతున్నారు. నేను కూడా ఇలాగే మెడకు సంబంధించిన నొప్పి అధికమై యోగ కేంద్రంలో అడుగుపెట్టాను. యోగాను మించిన వైద్యం మరేదీ లేదని తెలుసుకున్నా. ఆనందకర జీవితానికి యోగా ఎంతోగానో దోహదపడుతుంది. ఈ విషయంపై అందరి భాగస్వామ్యంతో గురువారం ఉదయం ర్యాలీ నిర్వహిస్తున్నాం. శుక్రవారం యోగా దినోత్సవం జరుపుతున్నాం.

– రాజశేఖరరెడ్డి, వివేకానంద యోగా కేంద్రం అధ్యక్షుడు, అనంతపురం

శ్రేష్టమైన ఆలోచనలతోనే ఆరోగ్యం



శ్రేష్టమైన ఆలోచనలు, విలువలతో కూడిన ఆచరణాత్మక జీవన విధానం మానసిక ఆరోగ్యాన్ని అందిస్తాయి. అదే శారీరక ఆరోగ్యానికి దోహదపడుతుంది. ఇందుకు యోగా, ధ్యానం అవసరం. చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ యోగా అభ్యసిస్తే జీవితం ఎంతో ఆనందంగా సాగుతుంది. ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటున్న అనేక ఒత్తిళ్లు, రుగ్మతలను సహజ సిద్ధమైన ధ్యానం, యోగా ద్వారా పోగొట్టుకోవచ్చు. ఈసారి మహిళలకు ప్రాధాన్యతనిచ్చే ఉమెన్ ఎంపవర్‌మెంట్ పేరుతో యోగా దినోత్సవం సాగడం ఆనందం.

– సిస్టర్ శారదా, బ్రహ్మకుమారీల ఇన్‌చార్జి

మైగ్రేన్ పోయింది



అనంతపురంలోని ఓ ప్రైవేట్ క్లినిక్‌లో నర్సుగా పనిచేస్తున్న నేను కొంత కాలం క్రితం తీవ్రమైన మైగ్రేన్‌తో బాధపడ్డాను. ఎంతమంది డాక్టర్లను సంప్రదించినా నయం కాలేదు. ఆ సమయంలోనే పామిడిలో యోగాభ్యాసం మొదలు పెట్టిన తర్వాత మైగ్రేన్ దూరమైంది.

– నాగలక్ష్మి, ప్రైవేట్ నర్సు, పామిడి

మొక్కలను తొలగించే సంస్కృతి వీడండి



తొలగించిన అరటి మొక్కలను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, పోలీసులు

యాడికి: మొక్కలను తొలగించే సంస్కృతి వీడాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి అన్నారు. యాడికి మండలం పెద్దపేట గ్రామ సమీపంలో అదే గ్రామానికి చెందిన మహిళా రైతు లక్ష్మీదేవి 200 అరటి మొక్కలను తొలగించారు. బుధవారం ఉదయం తోట వద్దకు వెళ్లిన లక్ష్మీదేవి కుటుంబ సభ్యులు విషయాన్ని గుర్తించారు. విషయం తెలుసుకున్న వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదినారాయణరెడ్డి భాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, తలారి నాగేష్ తదితరులు లక్ష్మీదేవి తోటకు చేరుకుని తొలగించిన అరటి మొక్కలను పరిశీలించారు. వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ... గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఏనాడూ ఇలాంటి హేయమైన చర్యలు జరగలేదన్నారు. మహిళా రైతు లక్ష్మీదేవి కేవలం వైఎస్సార్‌సీపీ సానుభూతిరాలనే ఉద్దేశ్యంతోనే టీడీపీకి చెందిన వారు ఇలా మొక్కలను తొలగించారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీకి చెందిన వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నా టీడీపీ పెద్దలు నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. అనంతరం లక్ష్మీదేవి పిర్యాదు మేరకు ఏఎస్ఐ వెంకటేస్, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

పోషకాహారంతో గొడ్డు మోతు పశువుల్లోనూ గర్భధారణ

- జిల్లా పశుగణాభివృద్ధి అధికారి డాక్టర్ టీవీ సుధాకర్



రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సుధాకర్

కణేకల్లు: గొడ్డు మోతు పశువులకు సరైన పోషకాహారమందిస్తే చూలు కడతాయని సాధ్యమవుతోందని జిల్లా పశుగణాభివృద్ధి అధికారి డాక్టర్ టీవీ సుధాకర్ తెలిపారు. కణేకల్లు మండలం గెనిగెరలో బుధవారం పశువుల్లో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా పశుగణాభివృద్ధి అధికారి మాట్లాడుతూ... కొన్ని పశువుల్లో హార్మోన్ల లోపం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తి చూలు కట్టకుండా ఉంటాయన్నారు. ఇలాంటి వాటికి పచ్చిమేతతో పాటు దాణా, కొండ చిగిరాకు, మునగాకు, కరివేపాకు, మొలకెత్తిన పెసలు, ఉలవలు, సద్దలు, రాగులు బాగా మేపినట్లైతే హార్మోన్ల లోపాన్ని అధిగమించి త్వరగా చూలుకడతాయన్నారు. అనంతరం శిబిరంలో 45 పశువులకు గర్భకోశ వ్యాధి నిర్ధారణ, చూడీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్త పశువులతోపాటు లేగదూడలకు నట్టల నివారణ మందులేశారు. కార్యక్రమంలో డాక్టర్లు మృధుల, వెంకటరెడ్డి, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

దుమ్మూధూళితో పంట నష్టాలు

- ఆర్డీఓకు ఫిర్యాదు చేసిన నేమకల్లు రైతులు



ఆర్డీఓ రాణి సుస్మితతో మాట్లాడుతున్న రైతులు

కళ్యాణదుర్గం: స్పాంజ్ ఐరన్ పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యంతో తమ పంటలు నాశనమవుతున్నాయని రాయదుర్గం నియోజకవర్గం బొమ్మనహళ్ మండలం నేమకల్లు గ్రామానికి చెందిన రైతులు వాపోయారు. కళ్యాణదుర్గంలోని ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం ఆర్డీఓ డాక్టర్ రాణి సుస్మితను నేమకల్లుకు చెందిన పలువురు రైతులు కలిశారు. కొన్నేళ్లుగా 200 మంది రైతులు సొంత భూముల్లో పంటలను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. ఏటా మిరప, ఉలవ, టమాట, గోరు చిక్కుడు, కంది తదితర పంటల సాగుతో కుటుంబాలను పోషించుకునేవారమన్నారు. అయితే తమ పొలాలకు ఆనుకుని ఉన్న స్పాంజ్ ఐరన్ ఓర్ పరిశ్రమలు సుమారు ఐదు ఉన్నాయని, ఈ పరిశ్రమల నుంచి వెలువడే రేణువులు, తెల్లటి పౌడర్ తమ పంట పొలాలపై పడుతుండడంతో ఏ పంట సాగు చేసినా ఎదగకుండా మొక్క దశలోనే నష్టపోతున్నామని వివరించారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకూ ఎకరాకు రూ. 10 వేల నుంచి రూ.15 వేల వరకు పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన ఆర్డీఓ డాక్టర్ రాణి సుస్మిత వారంలోపు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక ఇవ్వాలని తహసీల్దార్‌కు ఆదేశాలిస్తామన్నారు. రైతుల పొలాలను స్వయంగా పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలకు ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శర్మస్వలి, నాగార్జున, గురుస్వామి, వన్నూరప్ప, తిప్పేస్వామి, ప్రశాంత్, హనుమంతు, తిప్పేస్వామి, శేఖర్ గౌడ్, కురబ కిష్టయ్య, బోయ గోవిందప్ప, గౌరయ్య, అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళా కోటీశ్వరురాలు కావాలి



సమావేశానికి హాజరైన మహిళలు



మాట్లాడుతున్న విశాలాఫెర్రర్

బత్తలపల్లి: ఉమ్మడి జిల్లాలోని ప్రతి మహిళా కోటీశ్వరరాలు కావాలన్నదే ఆర్డీటీ ఆశయమని ఆ సంస్థ ఉమెన్స్ సెక్టార్ డైరెక్టర్ విశాలాఫెర్రర్ పేర్కొన్నారు. బత్తలపల్లిలో ఏర్పాటు చేసిన ఉమెన్ కో ఆపరేటివ్ సొసైటీ బ్యాంక్‌ను బుధవారం ఆమె ప్రారంభించారు. అనంతరం ఆర్‌కే ఫంక్షన్ హాలులో రీజినల్ డైరెక్టర్ ప్రమీల అధ్యక్షతన చైతన్య మహిళా పరస్పర సహాయక సహకార పొదుపు పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వంటింటికే పరిమితమైన మహిళలు అవకాశాలు అందిపుచ్చుకుని అసాధారణంగా రాణిస్తూ స్త్రీశక్తిని చాటుతున్నారన్నారు. మహిళలను అన్నిరంగాల్లో కుటుంబ సభ్యులే ప్రోత్సహిస్తున్నారన్నారు. కుటుంబ అవసరాల కోసం ఇతరుల మీద ఆధారపడి ఇబ్బందులు పడ్డ మహిళల కోసమే మహిళా కో ఆపరేటివ్ బ్యాంక్ స్థాపించినట్లు తెలిపారు. ఈ బ్యాంక్ ద్వారా రుణాలు తీసుకుని జీవనోపాధులు మెరుగు పరుచుకోవడం ద్వారా సకాలంలో చెల్లిస్తూ ఆదర్శంగా నిలవాలన్నారు. ఇప్పటికే కళ్యాణదుర్గం, కంబదూరు, కూడేరు మండలాల్లో మహిళా కో ఆపరేటివ్ బ్యాంక్‌లు ఏర్పాటు చేశామని, నాల్గవ బ్యాంక్‌ను బత్తలపల్లిలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని మహిళలకు సూచించారు. కార్యక్రమంలో ఏటీఎల్ రుక్మాంగద, హెచ్‌ఆర్డీ ధనలక్ష్మి, ఉమన్ ఎంపవర్‌మెంట్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై ఇనుప తీరు

- లోకో పైలెట్ అప్రమత్తతతో యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ప్రమాదం



రైల్వే ట్రాక్‌పై పడి ఉన్న ఇనుప తీరు

ధర్మవరం రూరల్: పట్టణంలోని గాంధీనగర్ రైల్వే అండర్ బ్రిడ్జిపై ఉన్న రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తులు ఇనుప తీరును అడ్డంగా ఉంచారు. లోకోపైలెట్ సంతోష్ అప్రమత్తతతో యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలుకు ప్రమాదం తప్పింది. మంగళవారం రాత్రి 8.20 గంటలకు జరిగిన ఈ ఘటన ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. ఆర్‌పీఎఫ్ సీఐ బోయ కుమార్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. యశ్వంత్‌పూర్ నుంచి బీదర్‌కు వెళ్లే యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు మంగళవారం రాత్రి 8.20 గంటలకు ధర్మవరం రైల్వేస్టేషన్‌కు సమీపంలోని గాంధీనగర్ ప్రాంతానికి చేరుకుంది. అండర్ బ్రిడ్జిపై గల రైల్వే ట్రాక్‌కు అడ్డంగా ఇనుప తీరును ఉంచిన దృశ్యాన్ని లోకోపైలెట్ సంతోష్ గమనించాడు. ఎమర్జెన్సీ బ్రేక్ వేసి రైలును ఆపాడు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఇనుప తీరు 8 అడుగుల పొడవు, 15 కిలోల బరువు కలిగి.. తుప్పు పట్టి ఉంది. ఇది రైల్వే ఆస్తి కాదు. ఎవరో ట్రాక్‌కు అడ్డంగా పడేశారు. ఈ ఘటనకు బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలి : డీఆర్‌ఎం



భద్రతా అంశాలపై ఇంజినీర్లు, సిబ్బందితో మాట్లాడుతున్న డీఆర్‌ఎం హర్ష ఖరే

రాయదుర్గం టౌన్: ప్రతి ఒక్కరూ అప్రమత్తతతో విధులు నిర్వర్తిస్తూ ప్రమాదాలను నివారించాలని రైల్వే అధికారులను, ఇంజినీరింగ్ సిబ్బందిని నైరుతి రైల్వే హుబ్లీ డివిజన్ డీఆర్‌ఎం హర్ష ఖరే ఆదేశించారు. బుధవారం ఉదయం రాయదుర్గం రైల్వే జంక్షన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ట్రాక్ పటిష్టతను పరిశీలించారు. నిర్మాణం పూర్తి చేసుకున్న కొత్త రైల్వే స్టేషన్ భవనాలతో పాటు పాత రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేశారు. అనంతరం భద్రతా సంబంధిత అంశాలపై అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ప్రతి క్షణం అప్రమత్తంగా ఉంటూ భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలన్నారు. రైల్వే భద్రతకు తీసుకోవాల్సిన పలు అంశాలను వివరించారు.

సమస్యలపై వినతి

రాయదుర్గం రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలతోపాటు రైళ్ల రాకపోకలు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు రైల్వే సలహా సంఘం మాజీ సభ్యుడు గుడేకోట శివకుమార్, ప్రయాణికులు, ప్రముఖులు కేకేటీ రవి, జయంతి సురేష్ కుమార్ తదితరులు డీఆర్‌ఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా నూతన రైల్వే స్టేషన్ పూర్తయినా నేటి వరకు ప్రారంభించక పోవడం బాధాకరమన్నారు. తాగునీరు, ఇతర మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలన్నారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లు టాటానగర్, వారణాసి, జైపూర్ రైళ్లకు రాయదుర్గంలో స్టాపింగ్ ఇవ్వాలన్నారు. రాయదుర్గం–బళ్లారి డెమో రైలు సేవలు అమలు చేయాలన్నారు. చిక్‌జాజూర్ రైలును చిక్‌మగ్గలూరు వరకూ పొడగించాలని, తిరుపతి–కదిరిదేవరపల్లి ప్యాసింజర్‌ను పునరుద్ధరించాలని కోరారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



అనంతపురం: నగరంలోని నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని ఓ వృద్ధుడు మృతి చెందాడు. రాంనగర్ పాత రైల్వే గేట్ వద్ద ఉన్న స్టేట్‌బ్యాంక్ ఏటీఎం సమీపంలో షబ్బీర్ గుజరీ షాపు ఎదురుగా నెల రోజులుగా ఉంటున్న వృద్ధుడు (60) ఆ పరిసరాల్లో చిత్తు కాగితాలు, బాటిళ్లు సేకరించి గుజరీకి వేసి జీవనం సాగిస్తూ వచ్చాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం బ్రిడ్జి కిందనే ఆయన మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే 93640 10581, 99488 23346 నంబరల్లో సంప్రదించాలని సీఐ ప్రతాప రెడ్డి కోరారు.

రైతులపై ఎలుగుబంటి దాడి

పావగడ: తాలూకాలోని కేటీ హళ్లి గ్రామానికి చెందిన ఇద్దరు రైతులపై ఎలుగుబంటి దాడి చేసి తీవ్రంగా గాయ పరచింది. గ్రామానికి చెందిన రైతులు హుత్తన్న, దాసన్న బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో తమ గేదెలు, మేకలను పొలం నుంచి ఇంటికి తోలుకెళుతుండగా పొదల్లో నుంచి ఒక్కసారిగా ఎలుగుబంటి బయటకు వచ్చి దాడి చేసింది. అతి కష్టంపై దాడి నుంచి తప్పించుకున్న రైతులను స్థానికులు వెంటనే కేటీ హళ్లిలోని పీహెచ్‌సీకి తరలించారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

ధర్మవరం రూరల్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఎఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఈ మేరకు ఆ సెంటర్ మండల బాధ్యులు కె.దస్తగిరి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతీయువకులకు కంప్యూటర్, టూ వీలర్ మెకానిజం, ఎలక్ట్రికల్, లైట్... హెవీ మోటారు వెహికల్ డ్రైవింగ్, సెల్ ఫోన్ రిపేరీ తదితర అంశాలపై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఈ క్రమంలో ఈ నెల 20న (గురువారం) టూ వీలర్ మెకానిజం బ్యాచ్ ప్రారంభమం కానుంది. ఆసక్తి ఉన్న వారు పూర్తి వివరాలకు 93905 05952లో సంప్రదించవచ్చు.

విత్తన చట్టం.. మోసాలకు కళ్లెం

- ప్రైవేట్ విత్తన, ఎరువుల దుకాణాల్లో లైసెన్స్ ప్రదర్శన తప్పనిసరి
- ప్రతి కొనుగోలుదారుకూ రసీదు ఇవ్వాల్సిందే



హిందూపురం అర్బన్: ఖరీఫ్ వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఇదే తరుణంలో ప్రైవేట్ ఎరువులు, విత్తనాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఈ క్రమంలో రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని నకిలీ విత్తనాలు అంటగట్టే ముఠాలు లేక పోలేదు. దుకాణంలో ఒక రకమైన విత్తనం ఉంచుకుని రైతులకు మరో రకం విత్తనాలు అంటగట్టే మోసాలకు చెక్ పెట్టేలా విత్తన చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

మోసగిస్తే కఠిన చర్యలు..

విత్తనాలు కొనుగోలు సమయంలో రైతులకు ఎలాంటి అన్యాయం జరిగినా విత్తన చట్టం ద్వారా సంబంధిత విత్తనాల డీలర్లపై కఠినమైన చర్యలు చేపట్టే వీలుంది. విత్తన చట్టం–1966, విత్తన నిబంధనలు–1968, విత్తన నియంత్రణ–1983 చట్టాల ఆధారంగా అతి క్రమణలు, ఉల్లంఘనలు వర్తించేలా చట్టాన్ని రూపొందించారు. విత్తన విక్రయాల్లో మోసాలకు పాల్పడే వారిపై విత్తన నియంత్రణ ఉత్తర్వులు–1983 క్లాజ్3 కింద అతి క్రమించినందుకు ఆయా దుకాణాల్లో విత్తనాలను జప్తు చేయడంతో పాటు అత్యవసర సరుకుల చట్టం 1955 సెక్షన్'ఏ' ప్రకారం జరిమానా విధిస్తారు.

విత్తన లైసెన్స్ ప్రదర్శించాలి..

జిల్లాలో సుమారు 295 ప్రైవేట్ డీలర్ల దుకాణాలు ఉన్నాయి. వీటిలో సుమారు 87 విత్తన విక్రయ డీలర్లు, మిగిలిన దుకాణాల్లో ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తుంటారు. ప్రైవేట్ విత్తన విక్రయ దుకాణాల్లో తప్పని సరిగా విత్తన లైసెన్స్‌లను ప్రదర్శించాలి. విత్తన లైసెన్స్ లేకుంటే ఆయా దుకాణాల్లో విత్తనాల విక్రయాలు చేపట్టరాదు. నోటీసులు ఇచ్చి దానికి సరైన సమాధానం ఇవ్వక పోతే విత్తన నియంత్రణ ఉత్వర్వులు–1983 క్లాజ్ 5 ప్రకారం డీలర్ లైసెన్స్ రద్దు చేయడానికి, సస్పెండ్ చేసేందుకు వ్యవసాయ అధికారులకు పూర్తి అధికారముంది. అలాగే విత్తనాలు విక్రయించే దుకాణాల్లో కచ్చితంగా ధరలు, స్టాకు బోర్డులను ఏర్పాటు చేయాలి. లేకుంటే విత్తన నియంత్రణ ఉత్తర్వులు –1983 క్లాజ్ 8 ప్రకారం ఆయా దుకాణాల్లో విత్తనాల అమ్మకాలు నిలుపుదల చేయవచ్చు. అంతే కాక అధికారులు వారి లైసెన్స్‌లను రద్దు చేయవచ్చు. విత్తనాల కొనుగోలు సమయంలో రైతులకు తప్పని సరిగా దుకాణదారు కచ్చితంగా కొన్న విత్తనానికి రసీదు ఇవ్వాల్సి ఉంటుంది. రసీదు ఇవ్వని పక్షంలో విత్తన నియంత్రణ ఉత్తర్వులు 1983–క్లాజ్ 9 ప్రకారం దుకాణదారునికి నోటీసు ఇచ్చి, సమానధానం లేకపోతే డీలర్ లైసన్స్ రద్దు చేయవచ్చు. ప్రైవేట్ విత్తనాల వ్యాపారి వద్ద కొనుగోలు చేసిన బస్తాలకు లేబుల్ లేకున్నా... విత్తన చట్టం 1966 సెక్షన్ 7 ప్రకారం జరిమానా విధిస్తారు. కాలం చెల్లిన విత్తనాలు విక్రయిస్తే విత్తన చట్టం 1966 సెక్షన్ 7 ప్రకారం విత్తన నియంత్రణ ఉత్తర్వులు 1983 క్లాజ్ 8ను అనుసరించి డీలర్ లైసెన్స్ రద్దు చేస్తారు.

నిబంధనలు పాటించాల్సిందే



ప్రభుత్వం రూపొందిచన విత్తన చట్టానికి అనుగుణంగా ప్రైవేట్ విత్తనాల డీలర్లు విక్రయాలు చేపట్టాలి. నిబంధనలు అతిక్రమిస్తే భారీ జరిమానాతో పాటు దుకాణాల లైసెన్స్‌లు రద్దు చేసే అవకాశం ఉంది.

– అల్తాఫ్ అలీ ఖాన్, ఏడీఏ, హిందూపురం

క్లుప్తంగా

అన్నదానం



ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఎదుట అన్నదానం చేస్తున్న సాయిట్రస్టు సభ్యులు

అనంతపురం మెడికల్: ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ వర్ధంతిని పురస్కరించుకుని సాయి ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఎదుట అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కరువు జిల్లా అనంతపురం ప్రజలకు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ అందించిన సేవలు మరువలేనివని సాయి ట్రస్టు వ్యవస్థాపకుడు డాక్టర్ విజయసాయి పేర్కొన్నారు. కార్యక్రమంలో సాయిట్రస్టు సభ్యులు రాఘవన, నారాయణ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి



మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్ గురుప్రసాద్

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని స్థానిక ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గురుప్రసాద్ కోరారు. బుధవారం కళాశాల ప్రాంగణంలో వంద మొక్కలు నాటారు. పరిసరాల్లో పచ్చదనం పెంపొందేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి జె.శివప్రసాద్, సీనియర్ అధ్యాపకులు బి.ఉష కుమారి, బి.శాంతిబాయి, సిబ్బంది పాల్గొన్నారు.

25న వేలంపాట

అనంతపురం కార్పొరేషన్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు చెందిన కాలపరిమితి దాటిన 12 వాహనాలను ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈనెల 25వ తేదీన డీఎంహెచ్ఓ కార్యాలయం ఆవరణలో వేలం వేస్తామని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు కనీస రుసుము చెల్లించి ఈ వేలంలో పాల్గొనాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం డీఎంహెచ్ఓ కార్యాలయంలో సంప్రదించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లు వేగవంతం చేయాలి



మంత్రి లోకేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న అధ్యాపకులు

అనంతపురం ఎడ్యుకేషన్: 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ వేగవంతంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం నాయకులు విన్నవించారు. ఈ మేరకు బుధవారం మంత్రి లోకేష్‌ను విజయవాడలో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ కళాశాలల్లో నెలకొన్న వివిధ అంశాలపై చర్చించారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కురుబ జయప్ప, ప్రధానకార్యదర్శి డాక్టర్ కోనంకి శ్రీధర్, గంగినేని రంగనాథం, రాష్ట్ర ఆర్థికకార్యదర్శి డాక్టర్ గుత్తా రాజశేఖర్ ఉన్నారు.

సికిల్ సెల్ ఎనీమియాను నిర్మూలిద్దాం



తూంచర్లలో విద్యార్థులతో కలసి ర్యాలీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

కనగానపల్లి: సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొంటోందని పీహెచ్‌సీ డాక్టర్ చెన్నారెడ్డి తెలిపారు. సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన మిషన్‌–2047 కార్యక్రమంపై బుధవారం ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులతో కలిసి ర్యాలీలు చేపట్టారు. గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా వచ్చే సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి గురించి ప్రజలకు తెలియజేశారు. ఎర్రరక్త కణాల రుగ్మత వల్ల వచ్చే ఈ వ్యాధి తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వస్తుందన్నారు. దీనిని సకాలంలో గుర్తించి అవసరమైన మందులు వాడితే నయం చేసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్ వైజర్ శ్రీనివాసులు, ధనమ్మ, సీహెచ్‌ఓలు, స్థానిక పాఠశాలల ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

టమాట నారు ధర పతనం

- మొక్క రూ.20 పైసలు పలుకుతున్న వైనం
- టమాట ధరలు పెరిగినా సాగుకు ముందుకు రాని రైతులు
- నర్సరీల్లో వృథా అవుతున్న నారు



నర్సరీలో అమ్ముడుపోని టమాట నారు



మచ్చ తెగులు సోకడంతో ఎదగని మొక్క

ఆత్మకూరు: ప్రస్తుతం టమాట ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. మార్కెట్‌లో కిలో రూ.80 నుంచి రూ.100 వరకూ ధరలు పలుకుతున్నాయి. టమాట కొనాలంటే ప్రజలు భయపడుతున్నారు. ప్రస్తుతం 15 కిలోల టమాట బాక్సు ధర మార్కెట్‌లో రూ.800 వరకు పలుకుతోంది. దీంతో సామాన్య ప్రజల చేతికి వచ్చే సరికి కిలో వంద రూపాయల వరకు పలుకుతోంది. ఓ వైపు టమాటా ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. మరో వైపు టమాట మొక్కలు (నార) మాత్రం కొనుగోలు చేసేందుకు రైతులు ముందుకు రావడం లేదు.

తగ్గిన డిమాండ్..

రెండు వారాల క్రితం టమాట నారకు నర్సరీల్లో మంచి డిమాండ్ ఉండేది. ఒక మొక్క రూ.50 పైసలకు పైగానే విక్రయాలు సాగాయి. దీంతో నిర్వాహకులు భారీగా టామాట నారను సిద్ధం చేశారు. మండల వ్యాప్తంగా దాదాపు 50 నర్సరీలకు పైగా ఉండగా.. ఒక్కొక్క నర్సరీలో లక్షలకు పైగా నార పోసి పెట్టారు. అయితే టామాట పంట సాగు చేసేందుకు రైతులు ఆసక్తిగా చూపడం లేదు. దీంతో చాలా నర్సరీల్లో మొక్కలు పెద్దవి కావడంతో నార మొత్తం పీకేసి బయట పడేస్తున్నారు. నర్సరీ నిర్వాహకులు ప్రస్తుతం నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో ఒక మొక్క రూ.50 పైసల వరకూ విక్రయించారు. ప్రస్తుతం ఒక మొక్క రూ.20 పైసలకు విక్రయిస్తామని చెప్పినా కొనుగోలు చేసేందుకు రైతులు ముందుకు రావడం లేదు.

వర్షాలే కారణమా?

టమాటా సాగు చేయడానికి ప్రస్తుతం మంచి సీజన్. ఈ సీజన్‌లో చాలా మంది రైతులు టమాట సాగు చేసేందుకు ఆసక్తి చూపుతారు. మే ఆఖరుకు జూన్ నెలలో ఎక్కువగా టమాట సాగు చేయడం వల్ల రైతులకు మంచి గిట్టుబాటు ధర లభిస్తుంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రైతులు తమ పొలాలను దుక్కులు చేయలేక పోతున్నారు. అధిక వర్షాలతో పంట దెబ్బతింటుందనే ఉద్దేశంతో టమాట సాగు చేయడానికి ఆసక్తి చూపడం లేదు.

టమాట మొక్కలకు 'మచ్చ' తెగులు

టమాట సాగు చేస్తే ఒక ఎకరాకు దాదాపు రూ.20 వేల వరకు ఖర్చు వస్తుంది. కాని వర్షాలు ఎక్కువగా కురిసినా.. లేదా ఎండ లేకుండా మబ్బులు కమ్మినా టమాట పంటకు ఎక్కువగా రోగాలు వ్యాపించే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గత రెండు, మూడు వారాల క్రితం నాటిన టమాట మొక్కలకు 'మచ్చ' రోగం సోకింది. రైతులు రోజూ పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. ఉదయాన్నే మందు పిచికారీ చేస్తే తిరిగి సాయంత్రానికి వర్షం కురుస్తుండటంతో చాలా మంది రైతులు మొదట్లోనే నష్టాలను చవి చూస్తున్నారు.

సురక్షిత ప్రమాణాలు పాటించకపోతే ఎలా?



హోటల్ నిర్వాహకులపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న అదనపు కమిషనర్ శ్రీహరిబాబు



53వ సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కమిషనర్

- హోటల్ నిర్వాహకులపై అదనపు కమిషనర్ శ్రీహరిబాబు ఆగ్రహం

అనంతపురం కార్పొరేషన్: టిఫిన్, భోజనం, తదితర తినుబండారాలు విక్రయాలు చేపట్టే హోటల్ నిర్వాహకులు సురక్షిత ప్రమాణాలు పాటించాలని అదనపు కమిషనర్ శ్రీహరి బాబు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని అరవిందనగర్ అరుణోదయ హోటల్, రాంనగర్‌లోని శ్రీగురు హోటల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇడ్లీ, తదితర టిఫిక్ వంటకాలపై ఈగలు వాలడంపై అదనపు కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మనమైతే ఇలా సురక్షిత ప్రమాణాలు పాటించని భోజనం తింటామా అని చురకలంటించారు. ప్రధానంగా నిషేధిత ప్లాస్టిక్‌ను వాడకూడదని స్పష్టం చేశారు. ప్యాకింగ్ చేసే సమయంలోనూ వేడి పదార్థాలను ప్లాసిక్ కవర్లలో కట్టకూడదని సూచించారు. ప్లాస్టిక్‌ను వినియోగిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

క్రమశిక్షణ పాటించాలి

విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటించి ప్రజలకు మెరుగైన సేవలందించాలని అదనపు కమిషనర్ శ్రీహరిబాబు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం నగరంలోని 53వ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం అందించే సేవల్లో నాణ్యత మరింత పెంచాలన్నారు. అక్రమ నిర్మాణాలు జరగకుండా ఎప్పటికప్పుడు నోటీసులు జారీ చేయాలన్నారు. నూతన భవనాలు, ఇళ్లకు పన్ను వేయాలని సూచించారు. ఎమినిటీ, ప్లానింగ్ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో సంతకాలు చేసి క్షేత్రస్థాయిలో కనిపించని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రాంనగర్, విద్యుత్‌నగర్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగు పనులను పర్యవేక్షించారు. చెత్తను ఎప్పటికప్పుడు కంపోస్టు యార్డుకు తరలించాలన్నారు.

పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



చిన్నయనగర్‌లో ర్యాలీ చేస్తున్న దృశ్యం

రాప్తాడు: బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు నరసింహా రెడ్డి అన్నారు. బుధవారం నేను బడికిపోతా కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్ఎం మాట్లాడారు. బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించి విద్యార్థుల సంఖ్య పెంచాలని సూచించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించినట్లు వివరించారు. ఈనెల 13 నుంచి జూలై 12వ తేదీ వరకు 6 నుంచి 14 సంవత్సరాల్లోపు వయస్సు ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. ప్రతి గ్రామంలో తిరిగి నమోదు చేయాలన్నారు. అదేవిధంగా బడి బయట పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని కోరారు. జూలై 12వ తేదీ వరకూ నేను బడికి పోతా కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు యల్లమ్మ, మాధవి, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విధులకు డుమ్మా కొడితే కఠిన చర్యలు

- ఎంపీడీఓ గీతావాణి
- సాక్షి కథనానికి స్పందించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

రాప్తాడు: సచివాలయ ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరు కాకపోతే చర్యలు తప్పవని ఎంపీడీఓ గీతావాణి అన్నారు. ఉద్యోగులు విధులకు రాకుండా అలసత్వం ప్రదర్శిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం హంపాపురం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈనెల 15న 'సారోళ్లు ఎక్కడికి వెళ్లారో', ఈనెల 16న 'మారని సచివాలయ సిబ్బంది తీరు' శీర్షికలతో సాక్షిలో కథనాలు ప్రచురితమయ్యాయి. జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశాలతో ఎంపీడీఓ గీతావాణి గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. విధులకు హాజరు కాని సిబ్బంది సంజాయిషీ రాసి ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఉద్యోగులు తమ విధులకు రాకుండా ప్రజలకు సకాలంలో సేవలు అందించడానికే సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సకాలంలో సేవలు అందించకపోతే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయాల్లో తక్కువ సేవలు ప్రజలకు అందుతున్నాయని.. సేవల సంఖ్యను పెంచాలన్నారు. గ్రామంలో అర్హత ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేయాలన్నారు. ప్రతి సచివాలయ ఆవరణలో సిబ్బంది ఫోన్ నంబర్లను ప్రజలకు తెలిసేలా పొందుపర్చాలని ఆదేశించారు. సిబ్బంది సమయానికి విధులకు హాజరై, సక్రమంగా పని చేయలన్నారు. ఇప్పటి నుంచి మండలంలో ప్రతి సచివాలయాన్ని సందర్శిస్తానని తెలిపారు. విధులకు రాకుండా నిర్లక్ష్యం చేసే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు చేయాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సెల్వియా సోలమన్

చెన్నేకొత్తపల్లి: ప్రభుత్వాసుపత్రుల్లోనే ప్రసవాలు చేయాలని డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ సెల్వియా సోలమన్ సిబ్బందికి సూచించారు. బుధవారం ఎన్ఎస్‌గేట్ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. వైద్య శిబిరాన్ని పర్యవేక్షించిన డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ఓ.. గర్భవతుల పట్ల వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం చెన్నేకొత్తపల్లి సచివాలయలం–1లో గర్భిణులకు చేస్తున్న వైద్య పరీక్షలపై ఆరా తీశారు. వైద్య సేవలు ఎలా ఉన్నాయని గర్భిణులను అడిగి తెలుసుకున్నారు. పౌష్టికాహారం సక్రమంగా అందుతోందా అని ఆరా తీశారు. ప్రభుత్వాసుపత్రుల్లో అందిస్తున్న వైద్య సేవలపై గర్భవతులకు వివరించాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ ఉదయ్, ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నేడు గ్యాస్ సిలిండర్ల పంపిణీ

రాప్తాడు: అనంతపురం రూరల్, రాప్తాడు మండలాల్లోని జన్మభూమి నగర్, కక్కలపల్లి, కాటిగాని కాల్వ, బుక్కచెర్ల, జి.కొత్తపల్లి, గాండ్లపర్తి, వరిమడుగు, పాలచెర్ల, భోగినేపల్లి, అయ్యవారిపల్లి గ్రామాల్లోని భారత్ గ్యాస్ వినియోగదారులకు గురువారం గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయనున్నారు. ఈనెల 18వ తేదీ వరకూ ఇండేన్ గ్యాస్‌ను బుక్ చేసుకున్న వారికి పాత ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వంట గ్యాస్ సిలిండర్లను అందజేయనున్నారు. మరింత సమాచారం కోసం 08554–286777 (భారత్ గ్యాస్), 08554–246199 (హాసిని ఇండేన్ పవన్ గ్యాస్), 08554–228789 (హనుమాన్ హెచ్‌పీ గ్యాస్)లో సంప్రదించవచ్చు.

నేటి బాలలే రేపటి పౌరులు



తలుపూరులో గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న చిన్నారులు

ఆత్మకూరు: నేటి బాలలే రేపటి పౌరులు. ఆరు సంవత్సరాల్లోపు వయస్సు ఉన్న చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య తెలియజేశారు. బుధవారం మండల వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే, పోషణ వేడుక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలతో కలసి ర్యాలీ చేపట్టారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించడం వల్ల పిల్లలకు పౌష్టికాహారంతో పాటు, చిన్న పిల్లలకు విద్య నేర్చుకోవాలన్న ఆసక్తి ఉంటుందని తెలియజేశారు. అలాగే అర్హులైన ప్రతి లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు.

ఆదమరిస్తే అంతే..



చందమూరు వద్ద ప్రధాన రహదారిపై ఉన్న గుంత

చెన్నేకొత్తపల్లి: ఎన్ఎస్‌గేట్ నుంచి ధర్మవరం వైపునకు రోజూ వందలాది వాహనాలు తిరుగుతూ ఉంటాయి. చందమూరు గ్రామ బస్టాండ్‌కు కొంత దూరంలో రోడ్డు మధ్యలో పెద్ద గుంత ఏర్పడింది. ఏమాత్రం ఆదమరచినా ప్రమాదానికి గురికాక తప్పదు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు భయపడుతున్నారు. ఇది మలుపులో ఉండటంతో గుంతను గమనించక వేగంగా వచ్చిన వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే ఈ రహదారిపై రోజూ పెనుకొండ సమీపంలో ఉన్న కియా కంపెనీకి చెందిన బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. సంబంధిత అధికారులు ఈ ప్రాంతంలో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

పెయింటర్‌కు తీవ్ర గాయాలు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఆలూరు రోడ్డులో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యానగర్‌కు చెందిన పెయింటర్ ఆంజనేయులు గాయపడ్డాడు. కర్నూలు జిల్లా చిప్పగిరిలో ఇంటి పెయింటింగ్ పనులు పూర్తి చేసుకుని తిరిగి గుంతకల్లుకు తన బైక్‌పై వస్తున్న ఆంజనేయులును ఆలూరు వైపు వెళ్తున్న కారు ఎదురుగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో ఆంజనేయులు కుడి కాలు విరిగిపోయింది. స్థానికులు అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆలూరు రోడ్డు ఎన్టీఆర్ విగ్రహం వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయించాలని కౌన్సిలర్ సుమోబాషా కోరారు.

24 నుంచి నెట్టికంటుడి మాన్యం కౌలుకు వేలం

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయ భూముల కౌలుకు ఈనెల 24 నుంచి వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ భద్రాజీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కర్నూలు జిల్లా చిప్పగిరి, ఆలూరు మండలాలు, అనంతపురం జిల్లా వజ్రకరూరు, విడపనకల్లు, గుంతకల్లు మండలాల్లోని ఆలయ భూములను వేలం పాట ద్వారా రైతులకు కౌలుకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారురు. కర్నూలు జిల్లాలోని కుందనకుర్తి, బెల్డోణ, ఖాజీపురం, నంచర్ల గ్రామాల్లో 24న, ఆలూరు మండలం మొలగవల్లి , చిప్పగిరి మండలం దౌల్తాపురం గ్రామాల్లో 26న, వజ్రకరూరు మండలం కొనకొండ్ల, విడపనకల్లు మండలం పాలికి గ్రామాల్లో ఈనెల 27న, గుంతకల్లు మండలం కసాపురంలో ఈనెల 28న బహిరంగ వేలం పాటను నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలం పొందిన వారు మూడేళ్లపాటు భూములను సాగు చేసుకోవచ్చని వివరించారు.

ఒకటో తరగతి ఫీజు రూ.1.50 లక్షలా?



ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం: అనంత ఆల్ఫ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఒకటో తరగతికి ఫీజు రూ.1.50 లక్షలు వసూలు చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆరోపించారు. విద్యను వ్యాపారం చేస్తున్న అనంత ఆల్ఫ్స్ యాజమాన్యం వైఖరి సరైంది కాదని పేర్కొన్నారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. పాఠశాల పేరుతో స్వతహాగా ముద్రించి అమ్ముతున్న పుస్తకాలను డిప్యూటీ డీఈఓ శ్రీనివాస రావు సీజ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయి స్వామి, ఎస్ఎస్‌యూవి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్ యనమల, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమణయ్య, జిల్లా కోశాధికారి హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

నేడు సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

రాప్తాడు: స్థానిక షిరిడి సాయిబాబ ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ పూజారి క్రిష్ణమూరి తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యం తీర్థ ప్రసాదాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనాల ఢీ: ఒకరికి గాయాలు



గాయపడిన వ్యక్తికి వైద్యం చేస్తున్న సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని పులేటిపల్లి క్రాస్ సమీపంలో బుధవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఒక వ్యక్తి కాలికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటంపల్లికి చెందిన చంద్రాయుడు ద్విచక్ర వాహనంలో వ్యక్తిగత పని నిమిత్తం చెన్నేకొత్తపల్లికి వస్తున్నాడు. పులేటిపల్లి సచివాలయంలో పని చేసే ఉద్యోగి చెన్నేకొత్తపల్లి నుంచి ద్విచక్ర వాహానంలో వస్తున్నారు. వీరిద్దరూ పులేటిపల్లి క్రాస్ వద్ద ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో వెంకటంపల్లికి చెందిన చంద్రాయుడు కాలికి గాయాలయ్యాయి. వెంటనే 108లో చెన్నేకొత్తపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

15 మంది పిల్లలకు శస్త్రచికిత్సలు



పుష్పగిరి కంటి ఆస్పత్రికి బయలుదేరిన పిల్లలు

అనంతపురం మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో దృష్టిలోపం సమస్యతో బాధపడుతున్న 15 మంది పిల్లలకు కడపలో పుష్పగిరి ఆస్పత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించేలా చర్యలు తీసుకుంది. బుధవారం పుష్పగిరి ఆస్పత్రి మేనేజ్‌మెంట్ పిల్లలను ప్రభుత్వ సర్వజనాస్పత్రి నుంచి కడపకు తీసుకెళ్లారు. ఉచిత రవాణ, భోజన సౌకర్యం ఆస్పత్రి కల్పించింది. డీఈఐసీ వైద్యురాలు డాక్టర్ శ్రీవిద్య, మేనేజర్ రజిత మాట్లాడుతూ.. ఏడుగురికి శుక్లాలు, మెల్లకన్ను, రెటీనా తదితర సమస్యలను గుర్తించినట్లు తెలిపారు. వీరందరికీ పుష్పగిరి ఆస్పత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తారన్నారు. కార్యక్రమంలో డీఈఐసీ సిబ్బంది జ్ఞాన ప్రసన్న, సోషల్ వర్కర్ రాజేశ్వరి, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన వైఎస్సార్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు



వైఎస్ జగన్‌తో వైఎస్సార్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లిలోని నివాసంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు తిప్పలూరి సుధీర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.